క్లుప్తంగా

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

మెరకనపల్లి(మోపిదేవి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ కేవీవీ సత్యనారాయణ కోరారు. మండల పరిధిలోని మెరకనపల్లి శివారు చిరువోలు గ్రామంలో ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్తులతో ఎస్‌ఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకారం అందించాలని సూచించారు.

జేఈఈ మెయిన్స్‌లో కొడాలి విద్యార్థి ప్రతిభ



కొడాలి(ఘంటసాల): జేఈఈ మెయిన్స్‌లో ఘంటసాల మండలం కొడాలి గ్రామానికి చెందిన విద్యార్థి ప్రతిభ చూపాడు. గురువారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కొడాలి గ్రామానికి చెందిన రైతు తుమ్మల శ్రీనివాసరావు– లక్ష్మీ కుమారి దంపతుల కుమారుడు తుమ్మల తేజేంద్ర ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 13,734వ ర్యాంక్ సాధించాడు.

కొమళ్లపూడిలో వంశీకృష్ణ విగ్రహ ప్రతిష్ట

కృత్తివెన్ను: కృత్తివెన్ను ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ తనయుడు వంశీకృష్ణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం కొమళ్లపూడి గ్రామంలో జరిగింది. వంశీకృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా గ్రామంలో ఆయన స్మృతివనం పేరుతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొని వంశీకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తన కుమారుని పేరుతో సేవా కార్యక్రమాలు చేస్తానని తెలిపారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోండి



అవనిగడ్డ: స్థానిక ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయాన్ని వినియోగించుకుని ఉద్యోగాలు సాధించిన ఇద్దరిని గురువారం ఘనంగా సత్కరించారు. లైబ్రరీలో జరిగిన కార్యక్రమంలో రైల్వే ఉద్యోగం సాధించిన మోదుమూడికి చెందిన బి.మణికంఠ, కేంద్రీయ విశ్వ విద్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లాకు చెందిన కె.స్నేహను లైబ్రేరియన్ జుజ్జువరపు ప్రభుదాస్ ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే వారికోసం లైబ్రరీలో మంచి పుస్తకాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకుని ప్రణాళికాబద్ధంగా సిద్ధమయితే విజయం వరిస్తుందని మణికంఠ, స్నేహ రుజువు చేశారన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వి.శ్రీదేవి, సిబ్బంది, పలువురు నిరుద్యోగులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సహాయం

చల్లపల్లి: గ్రామంలోని నిమ్మలతోటలో ఉన్న సీయోను వృద్ధాశ్రమానికి దాతలు సహాయం అందించారు. స్థానిక ప్రముఖ వైద్యులు, కీర్తి హాస్పిటల్ అధినేతలు డాక్టర్ సబ్బినేని భవానీ ప్రసాద్, డాక్టర్ నల్లపనేని కీర్తి దంపతులు గురువారం ఆశ్రమానికి రూ.35వేలు విలువ కలిగిన నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో పల్లెం సత్య గోపాలరావు, నడకుదురు అర్జున్, ఆశ్రమ నిర్వాహకుడు శీలం భాస్కరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ముస్లిం నేతల ప్రార్థనలు



చల్లపల్లి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ నాయకులు గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక సంతబజారు రోడ్డులోని జెండా చెట్టు వద్ద పార్టీ నాయకులు మహమ్మద్ కమాల్, షేక్ రసూల్ ఖోరీ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు విజయం సాధించాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో సయ్యద్ జహీర్, ముజీబ్ పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు స్థానిక ఈడేపల్లిలోని జెట్టి నరసింహం ప్రభుత్వ వృద్ధాశ్రమంలో గురువారం పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థులు మార్కెట్ అనే ఈవెంట్ ద్వారా సంపాదించిన సొమ్ముతో 60 మంది వృద్ధులు, వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్ మహ్మద్ ఆసీఫ్ హుస్సేన్, ఉపాధ్యాయులు ఆర్.విజయ్ కుమార్, డి.అరుణ కుమారి పాల్గొన్నారు.

శత్రువులంతా ఏకమైనా విజేత జగనే

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- కోడూరులో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



కోడూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, యువనేత వికాస్, వైఎస్సార్ సీపీ నాయకులు

కోడూరు: శత్రువులంతా ఏకమై ఎన్నికల సమరానికి సిద్ధమైనప్పటికీ ప్రజలు మాత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని నరసింహాపురం రహదారి, బైపాస్ రోడ్డు, సాయిబాబా దేవాలయ సమీపంలో గురువారం రమేష్‌బాబు, యువనేత సింహాద్రి వికాస్ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజలను కలుసుకొని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. కూటమి అభ్యర్థులకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలు అమలు చేయరని, రాష్ట్రం మరో పదేళ్లు వెనుకబడుతుందని రమేష్‌బాబు అన్నారు. ప్రజలు వాస్తవాలను గమనించి మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీలు ప్రకటిస్తున్న అసత్య పథకాలను ప్రజలు నమ్మడం లేదని, మే 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలని రమేష్‌బాబు కోరారు. యువనేత సింహాద్రి వికాస్ మాట్లాడుతూ ప్రజలు జనసేన, టీడీపీ నేతల మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. జగనన్న అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. చెప్పిన మాటకు కట్టుబడి 22ఏ నిషేధ భూముల సమస్యను పరిష్కరించడంతో పాటు కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారిని పటిష్టంగా నిర్మిస్తున్నట్లు వికాస్ చెప్పారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. యువనేత కడవకొల్లు చైతన్య, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, కోట పద్మావతి వరప్రసాద్, బడే గంగాధరరావు, చిలకలపూడి ధర్మయ్య, ఇంకొల్లు మురళీకృష్ణ, బడే నాగరాజు, ఆకురాతి తాతయ్య, కోట సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపిస్తే రైతుల మనుగడ ప్రశ్నార్థకం



సిరివెళ్లపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి పేర్ని (కృష్ణమూర్తి) కిట్టు అన్నారు. మండల పరిధిలోని సిరివెళ్లపాలెంలో గురువారం జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. టీడీపీ హయాంలో పోర్టు నిర్మాణం పేరుతో రైతులను మోసం చేయాలని చూసిన చంద్రబాబు కుట్రను ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందన్నారు. స్థానిక శాసన సభ్యుడు పేర్ని నాని రైతుల పక్షాన నిలబడి అనేక ఉద్యమాలు చేశారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా నిలబడింది కాబట్టే నేడు ఎవరి ఆస్తులు వారి దగ్గర భద్రంగా ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే మీ భూములకు మీరు రక్షణ కోల్పోయినట్లేనన్నారు. టీడీపీ హయాంలో పోర్టు పేరుతో 34 గ్రామాల రైతులను దగా చేయాలని చూశారన్నారు. వచ్చే ఎన్నికలలో పల్లె ప్రాంత ప్రజలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట తప్పకుండా చెప్పింది చెప్పినట్లు చేస్తాం

ప్రజాదీవెనలో ఉప్పాల రాము, హారిక



గరిశపూడి ప్రజాదీవెనలో ఉప్పాల రాము, హారిక

కృత్తివెన్ను: నమ్మి ఓటేయండి...నమ్మకంతో పనిచేస్తాం..ఇచ్చిన మాట తప్పకుండా చెప్పింది చెప్పినట్లు చేస్తామని పెడన నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. మండల పరిధిలోని గరిశపూడి గ్రామ పంచాయతీలో గల పెద చందాల, చినచందాల, దోమలగొంది గ్రామాల్లో గురువారం నిర్వహించిన ప్రజాదీవెన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి రాము పాల్గొన్నారు. ప్రతి గడపను సందర్శిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి పెడన ఎమ్మెల్యేగా తనను గెలిపించడంతో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఎన్నుకోవాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రతి నిరుపేదకు క్రమం తప్పకుండా యథావిధిగా కొనసాగాలంటే జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తీర ప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మైలా రత్నకుమారి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతిరాజు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్ నాగార్జున, ఎంపీటీసీ పోతురాజులతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

ఉప్పాల రమేష్(రాము)

పెడన: నామినేషన్‌కు నాతో పాటు వచ్చిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని, ఇదే అభిమానాన్ని, ఉత్సాహాన్ని పోలింగ్ రోజున కూడా చూపించి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) కోరారు. ఈ మేరకు గురువారం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఒక ప్రకటన విడుదల చేశారు. నామినేషన్ సందర్భంగా బుధవారం నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి వచ్చిన అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, వివిధ హోదాలలో, పదవులలో ఉన్న పెద్దలందరికీ కూడా ఎంతో రుణపడి ఉంటానని అన్నారు. తనను గెలిపిస్తే పెడన నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, తాగునీటికి, సాగునీటికి ప్రాధాన్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. తన తండ్రి ఉప్పాల రాంప్రసాద్ చాలా పెద్ద కుటుంబాన్ని(నియోజకవర్గాన్ని) అప్పగించారని, ఆయన ఉంటే ఎంతో సంతోషించే వారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, తన తండ్రి ఉప్పాల రాంప్రసాద్‌లపై అభిమానంతో వచ్చిన మీరందరికీ మరొక్కసారి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానన్నారు.

బందరులో ముమ్మరంగా ఇంటింటి ప్రచారం

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నగరంలోని పలు డివిజన్‌లలో గురువారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)లకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అఖండ విజయం చేకూర్చాలని ప్రజలను కోరారు. కార్పొరేటర్‌లు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, కన్వీనర్‌లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి అభ్యర్థుల కరపత్రాలను అందజేశారు. జగనన్న పాలన మరో ఐదేళ్లు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని కోరారు. ఆయా కుటుంబాల వారికి అందిన లబ్ధిని వివరించారు. నగరంలోని 12వ డివిజన్‌లో ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బందెల థామస్‌నోబుల్, 27వ డివిజన్‌లో మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అచ్చేబా తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు.

ప్రతిపక్ష పార్టీల్లో గుబులు



వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్‌కు తరలివచ్చిన జనం(ఫైల్)

అవనిగడ్డ: ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నామినేషన్‌కు వచ్చిన ప్రజా స్పందన ప్రతిపక్ష పార్టీల్లో గుబులు రేపింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సింహాద్రి రమేష్ నామినేషన్‌కు పదివేల మందికి పైగా తరలిరావడం ఆయా పార్టీలకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు కాపు సామాజిక వర్గం నుంచి కూడా పెద్ద ఎత్తున తరలి రావడంతో వారు కంగుతిన్నారు. జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ నామినేషన్ వచ్చిన జనం కంటే రెట్టింపు సంఖ్యలో జనం తరలి రావడం వైఎస్సార్‌సీపీలో జోష్ నింపినట్టయింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి చాలా మంది బైక్‌లపై రాగా, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు స్వచ్ఛందంగా ఆటోలు కట్టించుకుని నామినేషన్‌కు తరలి వచ్చారు.

జంపింగ్ జపాంగ్‌లను విశ్వసించని జనం

రాజకీయ ప్రాబల్యం కోసం పార్టీలు మార్చిన జనసేన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వి.బాలశౌరి, మండలి బుద్ధప్రసాద్‌లను దివిసీమ ఓటర్లు విశ్వసించడం లేదు. కండువాలు మార్చే సంస్కృతి తనది కాదని చెప్పి వారం తిరక్క ముందే పార్టీ మారిన మండలి బుద్ధప్రసాద్ వైఖరిని తప్పుపడుతున్నారు. తొలి నుంచి ఓ సామాజిక వర్గమంటే భయపడుతున్న టీడీపీలోని కొంతమంది ఎస్సీ, ఎస్టీ, బీసీలు జనసేన అంటే అయిష్టంగా ఉండటం ఆ పార్టీకి తలనొప్పిగా మారింది. ఈ పరిణామాలన్నీ ప్రతిపక్ష నేతలను కలవర పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నామినేషన్‌కు వేలాదిగా జనం తరలిరావడం ఆ పార్టీలో నూతనోత్సాహాన్ని నింపింది.

నామినేషన్‌కు తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

అవనిగడ్డ: నామినేషన్ కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చి బ్రహ్మాండంగా విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండుటెండను సైతం లెక్క చేయకుండా నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చూపిన ఈ ఆదరణ మరువలేనిదన్నారు. నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్టే వచ్చే నెలలో జరిగే ఎన్నికలలో కూడా ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

పెడనలో 12 మంది...24 నామినేషన్లు

- చివరి రోజు ఆరు నామినేషన్లు
- పెడన ఎన్నికల అధికారి వెంకటరమణ వెల్లడి
- పెడన ఈఆర్వో కార్యాలయాన్ని పరిశీలించిన పార్లమెంట్ అబ్జర్వర్



రికార్డులు పరిశీలిస్తున్న మచిలీపట్నం పార్లమెంటు అబ్జర్వర్ జాన్ కింగ్‌స్లే, పెడన ఈఆర్వో వెంకటరమణ

పెడన: పెడన నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ ముగిసిందని, మొత్తం 12 మంది అభ్యర్థులు 24 నామినేషన్ల సెట్లను సమర్పించారని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.వెంకటరమణ అన్నారు. 12 మంది అభ్యర్థులలో కొందరు మూడు సెట్లు, నాలుగు సెట్లు చొప్పున నామినేషన్లు వేశారని చెప్పారు. చివరి రోజున ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు కూడా నామినేషన్లు ఇచ్చారని తెలిపారు. రమేష్ ఉప్పాల(రాము), హారిక ఉప్పాల, కాగిత కృష్ణప్రసాద్, కాగిత శిరీషలతో పాటు కాట్రగడ్డ విష్ణుమూర్తి, కాగిత శ్రీహరి కృష్ణప్రసాద్ నామినేషన్లు వేశారని చెప్పారు.

పార్లమెంటు పరిశీలకుడు రాక

పెడన నియోజకవర్గ ఈఆర్వో కార్యాలయాన్ని మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు జాన్ కింగ్‌స్లే గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తీసుకున్న చర్యలు, నామినేషన్ల ప్రక్రియ తదితర అంశాల గురించి పెడన ఈఆర్వో వెంకటరమణ జాన్‌కింగ్‌స్లేకి వివరించారు. తొలుత ఆయనకు పెడన తహసీల్దారు, ఏఈఆర్వో కె.రాంబాబు తదితరులు పుష్పగుచ్ఛాలను అందజేసి ఆహ్వానం పలికారు. స్ట్రాంగ్ రూం వద్ద తీసుకున్న భద్రత తదితర అంశాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీంల గురించి జాన్‌కింగ్‌స్లే ఆరా తీశారు.

ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి కుటుంబసభ్యుల ప్రచారం



మల్లాయి చిట్టూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రంగనాథ్, డాక్టర్ సహజ, సింహాద్రి నిశ్చల తదితరులు

మల్లాయి చిట్టూరు(ఘంటసాల): ఘంటసాల మండలం మల్లాయి చిట్టూరు, పూషడం గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు కుమార్తెలు సింహాద్రి నిశ్చల, డాక్టర్ సహజ, అల్లుడు డాక్టర్ తన్నీరు రంగనాథ్ గురువారం రాత్రి స్థానిక నేతలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాయి చిట్టూరులోని ఆంజనేయస్వామి ఆలయంలో డాక్టర్ రంగనాథ్, డాక్టర్ సహజ, మాజీ ఎంపీటీసీ వీరమల్లు మేరీ కుమారితో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లాయి చిట్టూరు గ్రామంతో పాటు శివారు గ్రామాలైన మామిడితోట, ఎస్సీ కాలనీ, పూషడం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌బాబుకు, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావులకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడు మూల్పూరి వెంకయ్య, బూత్ కన్వీనర్ వీరమల్లు శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గల్లా గిరీష్, సచివాలయ కన్వీనర్లు బూరగడ్డ సతీష్, చికినం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామనవమి వేడుకలు



అభయాంజనేయస్వామి ఆలయం వద్ద గౌడ సంఘ ప్రతినిధులతో ఉప్పాల రాము, హారిక దంపతులు

పెడన: పట్టణంలోని బస్టాండు సమీపంలో ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకల ముగింపు సందర్భంగా గురువారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము), జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గౌడ సంఘ ప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత గౌడ సంఘ ప్రతినిధులు స్వామి వారికి నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నసమారాధన ప్రారంభించారు. పెడన పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సైతం పెద్ద ఎత్తున హాజరై స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. స్వామివారి ఉత్సవ మూర్తులతో పుర వీధులలో సాయంత్రం ఆరు నుంచి రాత్రి 11 గంటల వరకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని గౌడ సంఘం అధ్యక్షుడు పడమట బలరాం, కార్యదర్శి చిల్లిముంత చిరంజీవులతో పాటు సంఘ నాయకులు, పెద్దలు పర్యవేక్షించారు.

చివరిరోజు నలుగురు నామినేషన్లు

అవనిగడ్డ: నామినేషన్లు వేసేందుకు చివరి రోజైన గురువారం నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున బోయిన బుద్ధప్రసాద్, తాడంకి చంటి, జాతీయ జనసేన నుంచి వెంట్రప్రగడ ఆనంద్ కుమార్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా నీలా మనోహర్‌బాబు నామినేషన్ దాఖలు చేసినట్టు రిటర్నింగ్ అధికారి బాల సుబ్రహ్మణ్యం తెలిపారు.

గడువు ముగిసిన తరువాత వచ్చి ఆందోళన

నామినేషన్ వేసేందుకు గడువు ముగిసిన తరువాత వచ్చిన రమేష్‌బాబు అనే వ్యక్తిని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాలసుబ్రహ్మణ్యం తిరస్కరించారు. ఈ వ్యక్తి సాయంత్రం 3 గంటల లోపు సంబంధిత పత్రాలు తీసుకుని రావాల్సి ఉండగా తొలుత లోపలికి అనుమతిచ్చారు. అతనిని పరిశీలించిన అధికారులు నామినేషన్ పత్రాలు, నోటరీ లేకపోవడంతో వెనక్కి పంపించేశారు. దీంతో కొంతమంది జనసేన నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు సిద్ధం కాగా సీఐ త్రినాథ్, ఎస్‌ఐ రమేష్ పరిస్థితిని అదుపు చేసి వెనక్కి పంపిచేశారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

- విద్యుత్‌కోత లేకుండా చర్యలు
- సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

మచిలీపట్నంటౌన్: కృష్ణాజిల్లాలో విద్యుత్ వినియోగదారులకు కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్‌శాఖ సిద్ధమైంది. దీనికి అనుగుణంగా కోట్లాది రూపాయలు వెచ్చించి పనులను పూర్తి చేసింది. వేసవిలో విద్యుత్ వినియోగం పెరగనున్న దృష్ట్యా దీనికి అనుగుణంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ వేసవిలో విద్యుత్ సరఫరాను అంతరాయం లేకుండా చేసేందుకు అవసరమైన కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, 11 కేవీ ఫీడర్లు ఏర్పాటు చేశారు.

నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ఏర్పాటు ఇలా...

ఈ వేసవిలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అనుగుణంగా గత ఏడాది కాలంగా కృష్ణాజిల్లాలో నూతనంగా పది 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, ఒక 33 కేవీ ఫీడర్, 30 11 కేవీ ఫీడర్లు, 2776 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాట్లు చేసినట్టు విద్యుత్‌శాఖ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.భాస్కరరావు తెలిపారు. దెబ్బతిన్న పోల్స్, కండక్టర్లు, క్రాస్ ఆర్మ్స్, ఇన్సులేటర్లకు మరమ్మతులు చేశారు. నందమూరు, భాస్కరపురంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో అదనంగా ఎనిమిది ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. అర్తమూరు, పాముల్లంక, ఎస్ఆర్ నగర్, మోపిదేవి, మద్దూరుల్లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో అదనంగా 5 ఎంఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఉయ్యూరు, బంటుమిల్లి, లక్ష్మీపురంలోని సబ్‌స్టేషన్లలో ఉన్న పీటీఆర్‌ల సామర్థ్యాన్ని 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏ కు పెంచారు. ఈ చర్యలతో కృష్ణాజిల్లాలో వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయనున్నామని విద్యుత్‌శాఖ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.భాస్కరరావు తెలిపారు.

పేదింటి ప్రతిభాశాలికి సన్మానం

చల్లపల్లి: స్థానిక కేడీసీసీ బ్యాంకు వెనుక బజారుకు చెందిన షేక్ షహనాజ్ బేగం పదో తరగతిలో 566/600 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం ఆమెను యూటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. భవిష్యత్ విద్యా అవసరాలకు అండగా ఉంటామని ప్రకటించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నారంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన అవసరం



పెడన పీహెచ్‌సీ పరిధిలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెడన: మలేరియా వ్యాధి నివారణ చర్యలపై అందరికీ అవగాహన ఉండాలని పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పర్వేజ్‌హైదర్ అన్నారు. పెడన పీహెచ్‌సీ పరిధిలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ పర్వేజ్ మాట్లాడుతూ మలేరియా దోమకాటు వల్ల వ్యాపిస్తుందని, మలేరియా రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మేలని స్పష్టం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తాగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలలో మురుగునీరు నిలిచి ఉండటం వల్ల దోమలు అధికంగా పెరగడానికి ఆస్కారం ఉందని, ఆయా ప్రాంతాల్లో జాగ్రత్త చర్యలు చేపట్టడం మేలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఈఎంఆర్ కుమారి, మురళి, సౌదామిని, సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వ్యయ పరిశీలకుల నియామకం

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి వ్యయ పరిశీలకులుగా చవాన్ ప్రవీణ్ మోహన్‌దాస్‌ను నియమించినట్లు రిటర్నింగ్ అధికారి ఎం.వాణి గురువారం తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరైనా ఎన్నికల ఖర్చులకు సంబంధించి సందేహాలు, సమస్యలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చునన్నారు. పరిశీలకుని ఫోన్ నంబర్ 75061 76788 కు సంప్రదించవచ్చునన్నారు.